ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 20 పుష్పం :24 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-2-99, పొందువ్వ)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

నీవు విచారణామార్గములో ప్రయాణం చేసినా, ధ్యానమార్గంలో ప్రయాణం చేసినా ఏ మార్గంలో ప్రయాణం చేసినా భక్తి అవసరమే. భక్తిని తక్కువగా అంచనా వేయవద్దు భక్తి చాలా ముఖ్యం. భక్తి వలన మన మనస్సును ఈశ్వరునికి అర్పించవచ్చు. మన మనస్సును ఈశ్వరునికి అర్పించకపోతే మనకు సత్యసాక్షాత్కారం కాదు. మీరు దేనిని పొందటానికి సాధన చేస్తున్నారో దానిపట్ల భక్తి ఉంటే, ప్రేమ ఉంటే మీరు చేసే సాధన కష్టం అనిపించదు. దానిపట్ల ప్రేమ, భక్తి లేదు కాబట్టి సాధన చేయటం కష్టం అని మీకు అనిపిస్తుంది. ఈశ్వరుని పట్ల మీకు ఉన్న ప్రేమ, భక్తి సమానంగా ఉండేటట్లు చూసుకోండి, హెచ్చుతగ్గులు ఉండకూడదు. శరీరం ధరించి ఉన్న గురువు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సమాజంలో వెదజల్లటానికి ప్రయత్నంచేస్తూ ఉంటాడు. నిద్రపోతున్న నీ మంచితనాన్ని, తెలివిని, వివేకాన్ని మేల్కొలిపి అధ్యాత్మిక విద్య పట్ల ఇష్టం కలిగేటట్లు దేహంతో ఉన్న గురువు చూస్తాడు. గురువు అంటే సామాన్యం అని అనుకోవద్దు. మీ హృదయంలో ఏదైతే సత్యం ఉందో అదే మీరు కాని అదే మీరు అని మీకు తెలియటం లేదు. ఏ కారణం వలన, ఏ సంస్కారము వలన అదే మీరు అని మీకు తెలియటం లేదో ఆ సంస్కారములను ఆయన అనుగ్రహాన్ని పంపించి కాల్చి బూడిద చేస్తాడు. వాడు చెడ్డవాడు, వీడు చెడ్డవాడు అని మనం ఇలా అనుకుంటూ ఉంటాము. కాని గురువు అలా అనుకోడు. చెడ్డవాడిని చూసేటప్పుడు కూడ వాడిలో ఉన్న ఆత్మనే చూస్తూ ఉంటాడు. వాడు కూడ ఆత్మే కాని వాడిలో ఉన్న చెడ్డతనం వలన తను ఆత్మ అని వాడికి తెలియటం లేదు. అందువలన వాడిలో ఉన్న చెడ్డతనాన్ని తొలగిస్తాడు కాని వాడిని విమర్శించడు వాడు గురువు.

ఏదైతే నీవు తొలగించుకోవాలి అనుకుంటున్నావో దానిని విడిచిపెట్టు. దాని గురించి స్మరణ రానియ్యవద్దు, దానిని జ్ఞాపకంలోనికి రానివ్వకు. అది జ్ఞాపకంలోనికి వస్తూఉంటే ఆ జ్ఞాపకమే వాసన క్రింద మారుతుంది, అ జ్ఞాపకమే తలంపు క్రింద మారుతుంది, అదే బాధలకు కారణం అవుతుంది. మర్చిపోతే ఏమీ లేదు. సాధన చేతకాకపోయినా కొంతమంది ఎంత సహృదయులు ఉంటారు అంటే మనం వారి ఇంటికి వెళ్ళి నాలుగు వంకాయలు ఇమ్మని అడిగితే వారిదగ్గర ఉన్న వాటిలో మంచివి మనకు ఇచ్చి చెడ్డవి వారు ఉంచుకుంటారు. అటువంటి సహృదయం ఉన్నవారు కూడ ఉన్నారు. వారు ప్రత్యేకంగా సాధన చేయనక్కరలేదు

పరమేశ్వరుడు వారిని కరుణిస్తాడు. అజ్ఞానమును బట్టి జన్మలు వస్తున్నాయి, అజ్ఞానమును పోగొట్టుకోమని చెపుతున్నారు. అయితే ఈ అజ్ఞానం ఎప్పుడు వచ్చింది, ఎలా వచ్చింది అని ఒకరు అడుగుతున్నారు.దీనికి గౌతమబుద్ధుడు ఏమి చెప్పాడు అంటే నీవు ఏదైనా గ్రామం నడిచి వెళుతున్నావు అనుకో దారిలో నీ కాలులో ముల్లు విరిగింది అనుకో. ముల్లు విరిగినట్లు నీకు తెలుస్తోంది కాని అది ఎక్కడ నీ కాలులో దిగిందో నీకు తెలియటం లేదు. అప్పుడు కాలులో ఉన్న ముల్లును తీసివేయటానికి ప్రయత్నం చేయాలి గాని అది ఎప్పుడు విరిగింది, ఎక్కడ విరిగింది అని తెలుసుకోవటం వలన ప్రయోజనం లేదు. దానికోసం ప్రయత్నం చేయటం వలన నీ కాలం, శక్తి వృధా అవుతాయి. ఇలా ఆలోచించటం మానివేసి లోపలకు దిగిన ముల్లును తీసివేసి బాధానివారణ చూసుకో. అలాగే అజ్ఞానం తొలగించుకోవటం మానివేసి ఏ జన్మలో ప్రారంభమైనది అని విచారణ చేయటం వలన ప్రయోజనం లేదు. ఇప్పుడుఉంది అని నీకు తెలుస్తోంది కదా దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి అని చెప్పారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే అజ్ఞానం ప్రారంభం ఏమిటి, అంతం ఏమిటి ఇది అంతా మనస్సు గొడవే. అజ్ఞానం ఎప్పుడు ప్రారంభమయింది, ఎప్పుడు అంతమయిపోతుంది అనే లెక్కలు ఎటువంటివి అంటే కుందేటి కొమ్ము లావుగా ఉంటుందా, సన్నగా ఉంటుందా అని అడగటం లాంటిది. అసలు కుందేటికి కొమ్ము ఉండదు. అది లావుగా ఉందా, సన్నగా ఉందా అని అడగటంలో అర్థం లేదు. పిల్లలు లేని వాడి దగ్గరకు వెళ్ళి మీ అబ్బాయి పేరు ఏమిటి అని అడిగితే ఆ ప్రశ్నకు అర్థం ఏమిటి. ఆ ప్రశ్న వేసిన వాడిది తప్పు. అజ్ఞానం లేదు,అవిద్య లేదు. నీవు ఎవడివో నీకు తెలిస్తే ఇది ఏమీ లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది అన్నారు భగవాన్.

మన సాధనలు ఎలా ఉన్నాయో భగవాన్ చెప్పారు. ఒకడు సైకిలు స్టాండు వేసి బాగా స్పీడుగా త్రొక్కుతున్నాడట. అలా కొంతసేపు త్రొక్కి ఇంకా గణపవరం రాలేదు ఏమిటి, ఇక్కడే ఉన్నాము ఏమిటి అంటున్నాడు. వాడు సైకిలు త్రొక్కుతున్నాడు కాని సైకిలు స్టాండువేసి ఉంది. ఎంత స్పీడుగా త్రొక్కినా గణపవరం వెళ్ళడు, భీమవరం వెళ్ళడు అక్కడే ఉంటాడు. అలాగే మీరు సాధనలు చేస్తున్నారు, ఒక్క అంగుళం కూడా కదిలేదిలేదు. సాధనల పేరు మీద దేహబుద్ధి చుట్టూ తిరుగుతున్నారు. నీ దేహబుద్ధి ఎంతో కొంత తగ్గిస్తే కదా ముందుకు వెళ్ళటానికి. దేహప్రారబ్ధమును బట్టి మంచి ఎదురవుతూ ఉంటుంది,చెడ్డ ఎదురవుతూఉంటుంది, పొగిడేవారు ఉంటారు, విమర్శించేవారు ఉంటారు. ఎన్ని వచ్చినా ఇవి అన్ని దేహానికే, మనస్సుకే. మీరు దేహం కాదు, మనస్సు కాదు అంటున్నారు భగవాన్. ఒకోసారి ఆందోళన వస్తుంది, అశాంతి వస్తుంది, దు:ఖం వస్తుంది. ఏది వచ్చినా మీ మంచి కోసమే వస్తోంది అన్న సంగతి కూడా మర్చిపోకండి. ఎవరైనా మిమ్మల్ని విమర్శించారు అనుకోండి కంగారుపడవద్దు అది కూడా మీ మంచి కోసమే. మీ సంసారంలో ఏదైనా

కష్టాలు వచ్చినా అవి కూడా మీ మంచి కోసమే భగవంతుడు పంపించాడు అది మర్చిపోకండి. ఈ బాధలు భరించటం నీకు కష్టం అవ్వవచ్చు. ఇన్ని బాధలు వస్తున్నాయి ఏమిటి అని నీకు అనిపించవచ్చు. కాని ఇవి అన్నీ ఈశ్వరునికి తెలియకుండా రావటం లేదు. అందువలన వచ్చిన బాధలను అంగీకరించు.పాయసం త్రాగేటప్పుడు ఎలా ఉంటావో ఆ బాధలను కూడా అలాగే అంగీకరించు. నీకు ఏవో కొన్ని అనుభవాలు కలగజేయటానికే ఈ బాధలు, కష్టాలు వస్తున్నాయి, కాలక్షేపం కోసం రావటం లేదు. ఈశ్వరుడు కావాలనే వాటిని పంపించాడు అందువలన ఇష్టంతో అనుభవించు.

పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉన్నప్పుడు దేవుడి మీద నమ్మకంగా ఉంటారు. చిన్న కష్టం వస్తే దేవుడిని వదిలేస్తారు, గురువును వదిలేస్తారు. అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు ఈశ్వరుని మీద నమ్మకం కలిగి ఉండటం, భక్తి కలిగి ఉండటం పెద్ద కష్టం ఏమీ కాదు. పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా, నీకు భయం కలిగినా అప్పుడు ఈశ్వరుని మొఖాన్ని, గురువు మొఖాన్ని మీలో ఎంతమంది చూడగలుగుతున్నారు. నీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి పరిస్థితులు అనుకూలంగా లేవు అనుకో, నీకు కష్టాలు వస్తున్నాయి అనుకో, ఎవరి వలన అయితే నీకు కష్టం వస్తోందో వాడి మొఖంలో కూడా మీలో ఎంతమంది ఈశ్వరుడిని చూడగలుగుతున్నారు. పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు ఉదయాన్ని పూజచేసి రామా, కృష్ణా అనుకోవటం చాలా మందికి అలవాటు ఉంది. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు, మనస్సుకు గాయం తగిలినప్పుడు, అవమానాలు వచ్చినప్పుడు ఎంతమంది భగవంతుని స్మరిస్తున్నారు, భగవంతుని గుర్తు పెట్టుకొంటున్నారు. సామాన్య మానవులకు ఏదైనా కష్టం వస్తే భరించలేకపోతున్నారు. భక్తుడవై ఉండి నీవు కూడా ఆ కష్టాలను భరించలేకపోతే నీ భక్తిలో ఉన్న విశేషం ఏమిటి? నీలో ఉన్న ప్రత్యేకత ఏమిటి?

ప్రాణాయామం చేయటం, ధ్యానం చేయటం ఇవే సాధన అని అనుకోవద్దు. అవి కూడా సాధనలే. కాని నిరంతరము నీ గురువును, పరమేశ్వరుని నీ జ్ఞాపకాలలో ఉంచుకోవటం, నీ తలంపులలో నిలబెట్టుకోవటం కూడా సాధనే. నీ గురువు రూపం ఏది అయినా, నామం ఏది అయినా ఆ రూపాన్ని, ఆ నామాన్ని నిరంతరం జ్ఞాపకం పెట్టుకో. అది కూడా పెద్ద సాధన. నిరంతరం గురువును స్మరిస్తూ ఉంటే, గురువును జ్ఞాపకం పెట్టుకొంటూ ఉంటే తలంపులు రావటం ఆగుతూ ఉంటాయి. నెమ్మదిగా పల్చబడుతూ ఉంటాయి. సాధన చేయకుండా ఏదీ రాదు. మీరు సత్యాన్ని ప్రాక్టీసు చేస్తే సత్యం తెలియబడుతుంది. మనం చిన్న మాటనే పోషించుకోలేము ఇంక మనకు సత్యానుభవం ఎలా కలుగుతుంది. సుఖాలలో ఎలా ఉన్నారో, కష్టాలలో కూడా అలా ఉండటం ఈశ్వరస్మరణ కలిగిఉండటం ఎవరో కొద్దిమంది మహాత్ములకు, సత్పురుషులకు మాత్రమే సాధ్యం అందరికీ సాధ్యం కాదు. మనంతట మనకు మనోమూలం తెలియదు. సర్వకాల సర్వావస్థలలో మనుస్సును సమానంగా ఉంచుకొంటే

భగవంతుడు మిమ్మల్ని అనుగ్రహించి మనోమూలానికి దారి చూపిస్తాడు. అక్కడకు వెళ్ళాక మిగిలేది శాంతి, ఆనందమే. మనం ఒకోసారి కోసంగా ఉంటాము; ఒకోసారి ద్వేషంగా ఉంటాము. ఒకోసారి చిరాకుగా ఉంటాము. ఇలా రకరకాలుగా ఉంటాము. ఇలా రకరకాలుగా తయారవ్వటం వలన భగవంతుని ప్రేమనుగాని, ఆయన మాటయొక్క విలువనుగాని తెలుసుకోలేకపోతున్నాము. గొప్పగొప్ప అవకాశములను పోగొట్టుకొంటున్నాము. ఈ ఉద్రేకాల నుండి, ద్వేషాల నుండి బయటపడి చల్లబడితేనేగాని అనుగ్రహం చేతికి అందుతూ ఉన్నా దానిని గుర్తించే శక్తిని మేము పొందలేము. ఆవేశం తగ్గి ఆలోచన తెచ్చుకొంటేగాని భగవంతుని యొక్క స్పర్శ మనకు తెలియదు, ఆయన అనుగ్రహాన్ని గుర్తించలేము. గురువుయొక్క అనుగ్రహాన్ని, శక్తిని చాపల్యంతో కూడిన నీ మనస్సు అర్థం చేసుకోలేదు. నీ అంతట నీవు గురువు యొక్క ఔన్నత్యాన్ని గుర్తించలేవు. ఎప్పుడైనా నీ మనస్సుగాని, ఇంద్రియాలుగాని నిర్మలంగా ఉన్నాయి అనుకో నిశ్చలంగా ఉన్నాయి అనుకో అది గురువు అనుగ్రహం వలన అని గుర్తుంచుకో నీ తెలివితేటలవలన అని అనుకోవద్దు. వినయంగా ఉండటం, అణకువగా ఉండటం నేర్చుకొంటే నీ లోపల ఉన్న వస్తువు గురించి నీకు తెలుస్తుంది.

ఓ అరుణాచలా! నీవు బాహ్యంగా నాకు ఉపకారములు చేసినా, చేయకపోయినా నీ నుండి నన్ను వేరుచేసిన ఈ అజ్ఞానాన్ని నీ నుండి నన్ను దూరం చేసిన ఈ వ్యక్తి భావనను నా పట్ల దయ ఉంచి దానిని నాశనం చేసిపెట్టు. నేను దానిని నాశనం చేసుకోలేకపోతున్నాను. నీలో ఐక్యం అవ్వాలని ఉంది. ఏదైతే నీ నుండి నన్ను వేరుచేస్తోందో దానిని నేను తొలగించుకోలేకపోతున్నాను. దయవుంచి దానిని తొలగించి నీలో నన్ను ఐక్యం చేసుకో. వేరు బుద్ధిని తొలగించమని అడుగుతున్నాను. అది నీ నోటిలో ఉన్నట్లు నాకు తెలుస్తోంది. అది నీవు మింగేస్తే నా పని పూర్తి అవుతుంది. దానిని నోటిలో పెట్టుకొని నమలుతున్నావు, ఇంకా మింగలేదు. దానిని మింగటం అనే పని పూర్తి చేస్తావు కాని నేను ఉండలేక అడుగుతున్నాను. దానిని మింగేటప్పుడు నాకు బాధ లేకుండా చెయ్యి, దు:ఖానికి గురి చెయ్యకు నేను భరించలేను. అందువలన నాకు బాధలేకుండా నా అహంకారమును మింగేసి నా పని పూర్తిచెయ్యి. మీరు తెలివి తక్కువగా బ్రతుకవద్దు. తెలివిగా బ్రతకండి, సూక్ష్మబుద్ధితో బ్రతకండి. చెవులకు వినబడేది, కంటికి కనబడేది, మనస్సుకు స్ఫురించేది నిజం అని మీరు అనుకోవద్దు. తెలివితేటలుగా జీవించండి, అహంకార రహితంగా జీవించండి.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL